క్లుప్తంగా

వర్షం కురుస్తున్నా ఆగని రోడ్డుపనులు


యంత్రంతో రోడ్డు పనులు చేస్తున్న నిర్వాహకులు

సీతానగరం: చిరుజల్లులు కురుస్తున్నప్పటికీ మండలంలోని తామరఖండి–బక్కుపేట గ్రామాల మధ్య రోడ్డు అభివృద్ధి పనులను నిర్వాహకులు చేపట్టారు. ప్రభుత్వం రూ.20లక్షల నిధులు విడుదల చేయడంతో ఇప్పటికి మూడు లేయర్ల రోడ్డు అభివృద్ధి పనులు జరిగాయి. ఈ సందర్భంగా ఏఈ శంకరరావు వద్ద ప్రస్తావించగా రోడ్డు పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు సూచనల మేరకు వారం రోజుల్లో బీటీ రోడ్డు వేయడానికి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీచైర్మన్ వై.శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా ఘంటసాలకు నివాళులు


ఘంటసాల చిత్రపటానికి పూలమాలలు వేసిన గ్రామస్తులు

బలిజిపేట: మండలంలోని పెదపెంకి నేతాజీ గ్రంథాలయం వద్ద ఘంటసాల జయంతిని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ వ్యవస్థాపకుడు సంజీవనాయుడు ఆధ్వర్యంలో ఘంటసాల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడుతూ కీర్తిశేషులు, అమరగాయకుడు పద్మశ్రీ ఘంటసాలను స్మరించుకోవడం ఎంతో అదృష్టమన్నారు. కార్యక్రమంలో సంజీవనాయుడితోపాటు సాధు, బి.పోలినాయుడు, బి.లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

రూ.50 లక్షలతో పబ్లిక్ హెల్త్ యూనిట్


హెల్త్ యూనిట్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

మెంటాడ: మండలంలోని చల్లపేట ఆస్పత్రి ఆవరణలో పబ్లిక్ హెల్త్ యూనిట్ నిర్మాణానికి వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రాయిపిల్లి రామారావు సోమవారం భూమిపూజ చేశారు. ఏపీ(ఆంధ్రప్రదేశ్) వైద్య విధాన పరిషత్ నుంచి మంజూరైన రూ.50 లక్షల నిధులతో చేపడుతున్న ఈ నిర్మాణంలో ఆరోగ్య తనిఖీలతో పాటు మెడికల్ టెస్టులు కూడా చేయడం జరుగుతుంది. ఫిబ్రవరి నాటికి నిర్మాణం పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత చప్ప మాస్టారు, తదితరులు పాల్గొన్నారు.

మెంటాడకు ట్రైనీ కలెక్టర్


మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్

మెంటాడ: ట్రైనీ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్ సోమవారం మెంటాడకు విచ్చేశారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ విధులకు సంబంధించి, పూర్తిస్థాయి శిక్షణ పొందేందుకు నెల రోజుల పాటు ఇక్కడే ఉంటున్నట్లు ఆయన తెలిపారు. ప్రస్తుత తహసీల్దార్ రామకృష్ణతో పాటు తాను కూడా ప్రజలకు అందుబాటులో ఉంటానని ఆయన అన్నారు.

ఉపాధ్యాయుడి మృతి


చిన్నంనాయుడు(ఫైల్)

రామభద్రపురం: మండలంలోని మామిడివలసకు చెందిన ఉపాధ్యాయుడు ఆకుల చిన్నంనాయుడు(55) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. వివరాలిలా ఉన్నాయి.. ఆదివారం పాఠశాలకు సెలవు కావడంతో కుటుంబ సభ్యులతో కలిసి రోజంతా వరి చేను పనుల్లో నిమగ్నమయ్యారు. అదేరోజు రాత్రి 8 గంటల సమయంలో శరీరమంతా దద్దుర్లు పుట్టి, మంటగా అనిపించడంతో రాత్రి 10 గంటలకు మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ రాత్రి 12.30 గంటలకు ఆయన మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. డీఎస్సీ–1998లో ఇతడికి టీచర్ ఉద్యోగం రాగా, ప్రస్తుతం మండలంలోని జుమ్మువలస గిరిజన గ్రామంలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. గతంలో మామిడివలస పంచాయతీ సర్పంచ్‌గా ఈయన పనిచేశాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

సర్వం శివమయం


బలిజిపేట: గలావల్లిలో భక్తులతో కిటకిటలాడుతున్న శివాలయం


- శివాలయాలకు పోటెత్తిన భక్తులు
- జిల్లాకేంద్రంలో ఆధ్యాత్మిక శోభ


మక్కువ: శివలింగానికి పూజలు చేస్తున్న అర్చకుడు నారాయణరావు


పార్వతీపురం టౌన్: అడ్డాపుశీల ఆలయంవద్ద బారులు తీరిన బక్తులు


మక్కువ: భక్తులకు ప్రసాదం వడ్డిస్తున్న రంగునాయుడు


పార్వతీపురం టౌన్: పశుపతినాథ్ బ్రహ్మ సూత్ర శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు


పార్వతీపురం టౌన్: బైపాస్ కాలనీ శివాలయంలో ప్రత్యేక అలంకరణలో స్వామి వారు


సాలూరు: విశేష పూజలందుకుంటున్న సాలూరులోని కామాక్షమ్మ ఆలయంలో ఏకామ్రనాథ స్వామి

పార్వతీపురంటౌన్: పవిత్ర కార్తీకమాసం మూడవ సోమవారం పార్వతీపురం పట్టణ వ్యాప్తంగా భక్తి పారవశ్యం వెల్లివిరిసింది. పట్టణ సమీపంలోని అగ్రహారం కోనేరు వద్ద సందడి వాతావరణం నెలకొంది. అతి పురాతన ఆలయాలైన మండలంలోని అడ్డాపుశీల కాశీవిశ్వేశ్వరుని ఆలయం, పట్టణంలోని పార్వతీపరమేశ్వరుల ఆలయం, ఎస్ఎన్‌పీలోని శివాలయం, నవిరి కాలనీలో మల్లికార్జున స్వామి ఆలయం, సారికి వీధిలోని శివాలయం, బెలగాంలోని పశుపతినాథ్ బ్రహ్మసూత్ర శివాలయాలకు తెల్లవారు జామునుంచే భక్తులు పోటెత్తినారు. ఓం నమః శివాయ నామస్మరణతో శివాలయాల పరిసరాలు ప్రతిధ్వనించాయి. పెద్దంఖ్యలో భక్తులు పరమేశ్వరునికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. దైవ సన్నిధానాలు దేదీప్యమానంగా ప్రకాశించాయి. అగ్రహారం శివాలయంలో స్వామివారికి అభిషేకాలతోపాటు రుద్రాభిషేకాలు నిర్వహించారు.

బలిజిపేటలో..

బలిజిపేట: కార్తీక మాసం మూడవ సోమవారం మండలంలోని శివాలయాలు భక్తుల శివనామస్మరణతో హోరెత్తాయి. అయ్యప్ప, భవానీ మాలధారణ చేసుకున్నవారితో ఆలయాలు కిటకిటలాడాయి. నారాయణపురం, గలావల్లి, గంగాడ, చిలకలపల్లి, బలిజిపేట, వెంగాపురం, మిర్తివలస, బర్లి, అరసాడ తదితర గ్రామాల్లోని ఆలయాలలో భక్తులు పూజలు చేశారు. ముఖ్యంగా నారాయణపురం నీలకంఠేశ్వరస్వామి, గలావల్లి ఆలయాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ మేలు

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు


సీతానగరం: లక్ష్మీపురంలో పథకాల డిస్‌ప్లేను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల సీనియర్ నాయకుడు బి.శ్రీరాములునాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు బి.చిట్టిరాజు


వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: ప్రతి ఒక్క కుటుంబానికి మేలు చేసిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ అని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. ఈ మేరకు పట్టణంలోని 27, 28 వార్డు సచివాలయాల పరిధిలో సోమవారం నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో అయన పాల్గొని, సంక్షేమ అభివృద్ధి పథకాల లబ్ధిని తెలియచేసే డిస్ ప్లే బోర్డ్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ వార్డుల పరిధిలో అభివృద్ధికోసం రూ.13.33 కోట్లు వెచ్చించామన్నారు. ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందేందుకు పూర్తిగా దోహద పడడమే కాకుండా అన్ని వర్గాల ప్రజలకు చేదోడు వాదోడుగా నిలిచి, ప్రజలందరి మద్దతు పొందుతూ పేదవాడి మనసు గెలుచుకున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డేనన్నారు. ఇన్ని సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేసి సామాజిక సమతుల్యతను తీసుకువస్తూ పేద, బడుగు, బలహీన వర్గాలకు అన్ని విధాలుగా అండగా నిలుస్తున్నారు కనుకనే మళ్లీ సీఎంగా రాష్ట్రానికి జగనే కావాలని ఆకాంక్షించారు. సచివాలయం పరిధిలో గల అన్ని గ్రామాల ప్రజానీకం అంతా మళ్లీ వచ్చే ఎన్నికలలో మీ పూర్తి మద్దతును జగన్‌మోహన్‌రెడ్డికి అందజేసి మళ్లీ సీఎంగా గెలిపించే బాధ్యత మీ అందరిపై ఉందని కోరారు. అనంతరం గ్రామంలో ప్రజల సమస్యలను తెలుసుకుని వారు అడిగిన అన్ని సమస్యలకూ సావధానంగా సమాధానాలు చెపుతూ వేదిక వద్దనే సంబధిత అధికారులకు ఆదేశించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్‌పర్సన్ కె.రుక్మిణి, వైస్ చైర్మన్ యిండుపూరు గున్నేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, జేసీఎస్ కన్వీనర్ గొర్లి మాధవరావు, స్థానిక కౌన్సిలర్‌లు మజ్జి శేఖర్, యడ్ల త్రినాథ, జిల్లా పార్టీ జనరల్ సెక్రటరీ వి.గుర్రాజు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్లు మజ్జి నాగమణి, చెవిటి వెంకటరమణ, కౌన్సిలర్ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలు, మున్సిపల్ సిబ్బంది, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు, సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా పోటీలు నిర్వహిద్దాం..


ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం నిర్వహణపై చర్చిస్తున్న అధికారులు, వ్యాయామోపాధ్యాయులు

పాలకొండ రూరల్: ఈ నెల 7వ తేదీ నుంచి జరగాల్సిన 'ఆడుదాం ఆంధ్రా' పోటీలనుమ ప్రతిష్టాత్మకంగా నిర్వహిద్దామని మండల వ్యాయామోపాధ్యాయులు నిర్ణయించారు. సచివాలయ స్థాయిలో ఐదు రోజుల పాటు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, క్రికెట్, తదితర క్రీడలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ డొంక త్రినాథులు, మండల విద్యాశాఖాధికారి కె.సోంబాబు తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గ, మండల క్రీడా పరిశీలకులు వి.పుష్పనాథం, రాకోటి రాములు, సచివాలయాల అడ్మిన్ సెక్రటరీలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. క్రీడల నిర్వహణలో తీసుకోవాల్సిన నిబంధనలు, ప్రొటోకాల్‌పై చర్చించారు. సచివాలయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారుల నుంచి మండల స్థాయి జట్లను ఎంపిక చేస్తామన్నారు.

గిరిజన స్పందనకు 15 వినతులు


వినతులు స్వీకరిస్తున్న పీఓ కల్పనాకుమారి

సీతంపేట: ఐటీడీఏలో పీఓ కల్పనాకుమారి సోమవారం నిర్వహించిన గిరిజన స్పందనకు 15 వినతులు వచ్చాయి. డీకేటీ పట్టాలు మంజూరు చేయాలని పాండ్రమానుగూడకు చెందిన సవర రమేష్ కోరారు. చింతలగూడకు చెందిన తురకన్న ఆర్ఓఎఫ్ఆర్ పట్టాల రీ సర్వే చేయాలని కోరుతూ పలువురు వినతిపత్రం అందజేశారు. సీదిగూడ గ్రామస్తులు జీజీఎంపీ పనులు త్వరితగతిన చేపట్టాలని వినతి ఇచ్చారు. అంగన్‌వాడీ భవనం నిర్మించామని.. బిల్లులు మంజూరు చేయాలని వజ్జాయిగూడ మహేష్ కోరారు. వలసగూడ నుంచి లోతుగూడకు రోడ్డు నిర్మించాలని ఆయా ప్రాంత వాసులు కోరారు. చిన్నగోరకాలనీ వాసులు విద్యుత్ స్తంభాలు మంజూరు చేయాలని కోరుతూ వినతి సమర్పించారు. స్పందనలో ఈఈ సింహాచలం, డిప్యూటీ ఈఓ లిల్లీరాణి, పీఏఓ హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం


రాజాం సిటీ: దివ్యాంగ విద్యార్థులకు ట్యాబ్‌లు, బహుమతులు అందజేస్తున్న

రాజాం సిటీ/వంగర: మండల కేంద్రాల్లో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. రాజాంలోని భవితకేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో ప్రవీణ్‌కుమార్ పాల్గొని, దివ్యాంగులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. దివ్యాంగుల్లోని ప్రతిభాపాటవాలను గుర్తించి, ప్రోత్సహిస్తే వారు కూడా అన్ని రంగాల్లో రాణిస్తారన్నారు. అనంతరం పలువురు దివ్యాంగులకు ట్యాబ్‌లు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, పెంకి చైతన్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలి..


మంగళపురంలో ప్రజలకు సూచనలు చేస్తున్న ఎంపీడీఓ త్రినాథులు

పాలకొండ రూరల్: తుపాన్ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని ఎంపీడీఓ డొంక త్రినాథులు అన్నారు. నాగావళి నదీతీర ప్రాంత గ్రామాలైన చిన్న, గొట్ట మంగళాపురం, గోపాలపురం, అన్నవరం, అంపిలితో పాటు వెలగవాడ, తదితర గ్రామల్లో సచివాలయ సిబ్బందితో కలసి సోమవారం పర్యటించి, ప్రజలకు అవగాహన కల్పించారు. తుఫాన్ తీరం దాటే సమయంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు, తీర ప్రాంత ప్రజలు ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని సచివాలయ సిబ్బందిని సూచించారు.

నేడు జాబ్‌మేళా

గుమ్మలక్ష్మీపురం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ టి.శ్రీవరం ఓ ప్రకటనలో సోమవారం వెల్లడించారు. ఎనిమిది కంపెనీల్లో ఉద్యోగాల భర్తీకి అర్హులైన నిరుద్యోగ యువతీయువకులను ఇంటర్వ్యూ చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ప్రవళిక


విద్యార్థిని ప్రవళికతో పాఠశాల సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం: రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు మండలంలోని భద్రగిరి ఏపీ టీడబ్ల్యూఆర్ బాలికల పాఠశాల విద్యార్థిని టి.ప్రవళిక ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ యుగంధర్ సోమవారం తెలిపారు. ఇటీవల శ్రీకాకుళంలో జరిగిన జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో ప్రవళిక పాల్గొని, అత్యుత్తమ ప్రతిభ కనబరచడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి


రికార్డులను పరిశీలిస్తున్న డీఐఓ జగన్‌మోహన్‌రావు

సీతానగరం: తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డీఐఓ) టి.జగన్‌మోహన్‌రావు అన్నారు. ఈ మేరకు సోమవారం మండలంలోని పెదంకలాం పీహెచ్‌సీని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మందులు, వైద్యపరికరాలు, యాంటీస్నేక్ వీనం ఇంజక్షన్లు తదితరాలను తనిఖీ చేశారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యుత్ అంతరాయం లేకుండా ఇన్వర్టర్, బ్యాటరీ అందుబాటులో ఉంచాలన్నారు. ప్రసవానికి దగ్గరగా ఉన్న గర్భిణుల వైద్య సంరక్షణపై అత్యవసర చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. గ్రామాల్లో క్లోరినేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వివిధ శాఖల సిబ్బందితో సమన్వయం చేసుకుని తుఫానును సమర్థవంతంగా ఎదుర్కోవాలని కోరారు. ఆయనతోపాటు వైద్యాధికారి ఎం.రాధాకాంత్, సూపర్‌వైజర్లు సూర్యనారాయణ, వరలక్ష్మి తదితరులున్నారు.

కళ్లాల్లో ధాన్యం తరలింపు


ట్రక్‌షీట్‌ను రైతులకు అందజేస్తున్న ఆర్డీఓ కె.హేమలత


సాలూరు: పెదపదంలో లారీలతో ధాన్యం తరలిస్తున్న వ్యవసాయశాఖ ఏడీఏ మధుసూదనరావు, ఏఓ అనూరాధపండా

సీతానగరం: మండలంలోని కళ్లాల్లో నూర్పు చేసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని ఏఓ ఎస్.అవినాష్ తెలిపారు. ఈ మేరకు సోమవారం అంటిపేట, పణుకుపేట, చినభోగిలి గ్రామాల్లోని కళ్లాల్లోని ధాన్యానికి ట్రక్‌షీట్ కట్‌చేసి మిల్లులకు జీపీఎస్ విధానంలో తరలించామని చెప్పారు. కలెక్టర్ ఆధ్వర్యంలో శనివారం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించగా 1944 బ్యాగులు మిల్లులకు తరలించినట్లు చెప్పారు. ఈ రెండురోజుల్లో 11,828 బ్యాగులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా మిల్లులకు తరలించినట్లు తెలిపారు. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో కళ్లాల్లో ధాన్యం తడిసిపోయి, రైతులకు నష్టం వాటిల్లకుండా ముందు జాగ్రత్త చర్యగా ధాన్యాన్ని యుద్ధ ప్రాతిపదికన తరలిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఆర్‌బీకే వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

మిచాంగ్ తిఫాను కారణంగా గ్రామాల్లో చెదురుమదురు వర్షాలు కురవడంతో రైతులు నూర్చిడి చేసిన ధాన్యాన్ని తడవకుండా భద్రపరుచుకోవాలని ఆర్డీఓ కె.హేమలత సూచించారు. ఈ మేరకు సోమవారం ఆమె కాశీపేట గ్రామంలోని కళ్లాల్లో నూర్పు చేసిన ధాన్యం నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తుఫాన్ కారణంగా రైతులు నూర్పు చేసిన ధాన్యాన్ని ఆర్‌బీకే ద్వారా కొనుగోలు చేయనున్నామని, అంతవరకు రైతులు సరుకును భద్రంగా ఉంచుకోవాలని సూచించారు. ధాన్యం తూకం వేసి కళ్లాలనుంచి కొనుగోలు చేయనున్నట్లు తెలియజేశారు. అనంతరం లారీలకు లోడ్‌చేసి ధాన్యం తరలించడానికి ట్రక్‌షీట్లు రైతులకు అందజేశారు. కార్యక్రమంలో ఏఓ ఎస్.అవినాష్, రీసర్వే డీటీ పి.చిట్టెమ్మ, ఆర్ఐ శ్రీనివాస్, వీఆర్ఓ, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

వేగవంతంగా ధాన్యం తరలింపు

సాలూరు: మిచాంగ్ తుఫాన్ నేపథ్యంలో ధాన్యం కొనుగోలుతో పాటు తరలింపును వ్యవసాయశాఖ అధికారులు వేగవంతం చేశారు. ఇప్పటికే నూర్పు అయిన ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేసి వెంటనే తరలిస్తున్నారు. ఈ మేరకు సోమవారం మండలంలోని 65మంది రైతుల నుంచి 314.16 మెట్రిక్ టన్నులు, పాచిపెంట మండలంలో 9.2 మెట్రిక్‌టన్నులు, మక్కువ మండలంలో 9.6 మెట్రిక్‌టన్నుల ధాన్యం తరలించినట్లు వ్యవసాయశాఖ ఏడీఏ మధుసూదనరావు తెలిపారు. తుఫాన్ నేపథ్యంలో ఆఫ్‌లైన్‌లోనే రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి తరలిస్తున్నామని, ఆర్‌బీకేల వారీగా వ్యవసాయశాఖ సిబ్బందితో పాటు రైతులను అప్రమత్తం చేశామని తెలిపారు.

సకాలంలో గృహ నిర్మాణ లక్ష్యాలను పూర్తి చేయాలి


అధికారులతో మాట్లాడుతున్న ఎంపీడీవో రామకృష్ణ

తెర్లాం: జగనన్న కాలనీ లేఅవుట్లు, సొంత స్థలాల్లో లబ్ధిదారులు నిర్మిస్తున్న గృహ నిర్మాణ లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీవో శంబంగి రామకృష్ణ సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమావేశమైన ఆయన మండలంలో జరగనున్న సామూహిక గృహ ప్రవేశాల నాటికి ఇళ్లను సిద్ధం చేయాలన్నారు. 294 ఇళ్ల నిర్మాణాలను లక్ష్యంగా ఇవ్వడం జరిగిందని, వీటిన్నింటినీ పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రధానమంత్రి విశ్వకర్మ పథకానికి సంబంధించి, అర్హులైన కులవృత్తుల వారు రుణాల కోసం దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. త్వరలో చేపట్టనున్న కుల గణనకు సంబంధించి, రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించాలని, ప్రతీ సచివాలయ ఉద్యోగికి 100 ఇళ్ల సర్వేకు అప్పగించడం జరుగుతుందన్నారు. కొద్దిరోజుల్లో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించనున్న వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో మండలంలోని అన్ని శాఖల అధికారులు పాల్గొని, కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

ఆరోగ్య భద్రతపై దృష్టి సారించండి

- నగర కమిషనర్ సర్వేశ్వరరావు


సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న నగర కమిషనర్ సర్వేశ్వరరావు

పాలకొండ రూరల్: అకాల వర్షాల ప్రభావంతో పట్టణ ప్రజలు అనారోగ్యం పాలవకుండా సచివాలయ సిబ్బంది దృష్టి సారించాలని నగర కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు అన్నారు. సోమవారం తన కార్యాలయంలో పట్టణ పరిధిలోని తొమ్మిది సచివాలయాల అడ్మిన్ సెక్రటరీలు, హెల్త్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రోడ్లపై నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. హెల్త్ సిబ్బంది ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించి సేవలు అందించాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. తాగునీటి వనరుల్లో క్లోరినేషన్.. వార్డుల్లో పారిశుద్ధ్య పనుల తాజా స్థితిగతులపై సమీక్ష చేపట్టారు. ఆస్తి పన్ను వసూళ్ల వేగవంతం చేయాలన్నారు.